ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్నిబోధత!

కలియుగాబ్ది 5128, శ్రీ పరాభవ నామ సంవత్సరం

# హిందూ నగారా

మాసపత్రిక

సంపుటి 34 | సంచిక 08 | ఆగస్టు 2026 | శ్రావణ మాసం | పుటలు 16 | విడిప్రతి రూ.10

చందాదారులకు, పాఠకులకు
శ్రావణమాసం, రక్షాబంధన్, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



## రాఖీ



## సోదర బంధానికి పునాది
## సమరసతకు నాంది

# సంప్రదాయ పంటల వైవిధ్యానికి లారీ డ్రైవర్ కృషి

కనుమరుగవుతున్న సంప్రదాయ పంటలను పరిరక్షించేందుకు ఓ లారీ డ్రైవర్ దేశీయ కూరగాయల విత్తనాలను సేకరించి రైతులకు ఉచితంగా అందిస్తున్నాడు. బీరకాయ, సొరకాయ, దోసకాయ, చిక్కుడు సహా 20కి పైగా అరుదైన దేశీయ రకాల విత్తనాలను పంపిణీ చేస్తున్నాడు. కర్ణాటకలోని బెళగావి జిల్లా గొల్లహళ్లి గ్రామానికి చెందిన మంజునాథ్ వృత్తిరీత్యా లారీ డ్రైవర్. అతను తన వాహనాన్ని ఒక సంచార విత్తన బ్యాంకుగా మార్చేశాడు. కర్ణాటకతో పాటు పొరుగు రాష్ట్రాలలోని గ్రామాలు, పట్టణాలు, నగరాలకు దేశీయ విత్తనాలను తీసుకెళ్తాడు. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి లారీపై వెళ్లేటప్పుడు రైతుల దగ్గర కూరగాయల విత్తనాలను మార్పిడి చేసుకుంటాడు. ఒక ప్రాంతంలో సేకరించిన విత్తనాలను మరొక ప్రాంతంలో పంటగా వేసేలా చూస్తాడు. ఇప్పటి వరకు మంజునాథ్ 100 మందికి పైగా రైతుల వద్ద దేశీయ విత్తనాలను మార్పిడి చేసుకున్నాడు. ఈ క్రమంలో ప్రతీ విత్తన మార్పిడికి సంబంధించిన రైతు పేరు, ఫోన్ నంబర్, అడ్రస్ సహా పూర్తి వివరాలను రాసుకుంటాడు. టీ, భోజనం, సరుకులను ఎక్కించేటప్పుడు, దించేటప్పుడు ఎక్కడ లారీ ఆగినా మంజునాథ్ అక్కడి రైతులు, స్థానికులతో మాట్లాడుతాడు. ఆ గ్రామంలో ఏవైనా అరుదైన కూరగాయల రకాల విత్తనాలు ఉన్నాయా? అని అడుగుతాడు. తన దగ్గర ఉన్న దేశీయ విత్తనాలను తీసుకుని, గ్రామస్థుల వద్ద విత్తనాలు ఇమ్మని కోరుతాడు. వాణిజ్య వ్యవసాయం ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసిందని మంజునాథ్ అన్నారు. దేశీయ విత్తనాలతో సేంద్రీయంగా పండించిన ఆహారాన్ని తినాలని, ఈ విత్తనాల పంపిణీ నుంచి తాను ఎలాంటి ఆదాయాన్ని ఆశించడం లేదని తెలిపారు. అయితే విత్తనాలకు కొంత విలువ ఉండాలని తాను భావిస్తున్నారని చెప్పారు. అందుకే వాటిని భవిష్యత్తులో పూర్తిగా ఉచితంగా ఇవ్వకుండా నామమాత్రపు ధరకు అందిస్తారని అన్నారు.




## ఆషాఢం – గోరింటాకు సంబరం

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా "గోరింటా పూసింది – మనసంతా నిండింది" అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రాంత మహిళా ప్రముఖ్ శ్రీమతి ఇందిరాదేవి తెలిపారు. గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయం మాత్రమే కాకుండా ఆరోగ్యపరంగానూ ఉపయోగకరమని తెలిపారు. గత ఐదారేళ్లుగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, ప్రకాశం జిల్లా కందుకూరు, కోనసీమ జిల్లా అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, నంద్యాల జిల్లా మహానంది, అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం తదితర ప్రాంతాల్లో ఆషాఢ మాసంలో గోరింటాకు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జూలై 15 నుంచి ఆగస్టు 12 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, నగరాలు, మండల కేంద్రాల్లో ఉన్న బాలికల హాస్టళ్లలో గోరింటాకు కార్యక్రమాలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం నిర్ణయించింది. ఈ సందర్భంగా హాస్టళ్లలోని బాలికలకు గోరింటాకు పెట్టడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ధార్మిక విలువలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టనున్నారు.

## పూరీ రథయాత్ర – ఆరెస్సెస్ సేవ

పూరీలో జగన్నాథ రథయాత్ర ఈ సందర్భంగా ఆరెస్సెస్ స్వయంసేవకులు విస్తృతమైన సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. లక్షలాది మంది భక్తుల సమక్షంలో అంబులెన్స్ ల రాకపోకలకు ఆటంకం లేకుండా మానవ హారాలను ఏర్పాటు చేసి రద్దీని నియంత్రించారు. అలాగే అత్యవసర సేవల్లోనూ కార్యకర్తలు కీలక పాత్ర పోషించారు. అస్వస్థతకు గురైన భక్తులకు తక్షణ వైద్యం కోసం సకాలంలో ఆస్పత్రులకు తరలించారు. స్వయంసేవకుల అంకిత భావం, క్రమశిక్షణ అందరినీ ఆకట్టుకుంది. రథయాత్ర సందర్భంగా, 'ఉత్కల్ విపన్న సహాయతా సమితి' తన వార్షిక సేవా సంకల్పానికి అనుగుణంగా ఆర్ఎస్ఎస్ సహకారంతో తొమ్మిది రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించింది. ఆర్ఎస్ఎస్ ఒడిశా పూర్వ ప్రాంత సంఘచాలక్ సమీర్ కుమార్ మొహంతి, క్షేత్ర సేవా ప్రముఖ్ దీపక్ కుమార్ రౌత్, కమిటీ కార్యదర్శి వి. కృష్ణ గోపాల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది, ఒడిశాలోని మొత్తం 30 జిల్లాల నుంచి 1,800 మందికి పైగా స్వయంసేవకులతో పాటు 'హిందూ జాగరణ మంచ్'కు చెందిన 500 మందికి పైగా కార్యకర్తలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు మంచి నీటిని పంపిణీ చేశారు. బడా దండా పొడవునా పరిశుభ్రతను కాపాడేందుకు ఒక ప్రత్యేక బృందం పనిచేసింది.

# సంపూర్ణ సమాజ రక్షణకు సమాజమే 'రక్ష' (ఆగష్టు 28 -- రాఖీ పూర్ణిమ)



హిందూ సమాజంలోని కుటుంబాల ద్వారా సోదరులకు సోదరీమణులు రక్షా సూత్రాన్ని కట్టే పండుగ రూపంలో రక్షాబంధన్ ప్రచారంలో ఉంది. భారతీయ ప్రజలతో ప్రాచీన కాలం నుండి రక్షాబంధన్‌కు గాఢమైన సంబంధం ఉంది.

పురాతన భారతీయ పరంపరలో సమాజానికి మార్గదర్శకులుగా గురువు ఉండేవారు. ఈ దేశపు జ్ఞానపరంపరను రక్షించే సంకల్పాన్ని మిగిలిన సమాజంతో ఈ రక్షా సూత్రం ద్వారా చేయించేవారు. సాంస్కృతిక, ధార్మిక పురోహిత వర్గం కూడా రక్షాసూత్ర మాధ్యమంగా సమాజానికి రక్షా సంకల్పం చేయించేది. రాజ్య వ్యవస్థ లోపల రాజ పురోహితుడు రాజుకు రక్షాసూత్రం కట్టి ధర్మం, సత్య రక్షణతో బాటు మొత్తం ప్రజల రక్షణ సంకల్పాన్ని చేయించేవాడు. ప్రస్తుతం కూడా ఎలాంటి ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమం జరిగినా తర్వాత రక్షాసూత్రం ద్వారా అందులో పాల్గొన్న వారందరితో రక్షణ సంకల్పం చేయించడం జరుగుతోంది. మొత్తం మీద రక్షా బంధన్ మౌలిక భావన ఏమిటంటే సమాజంలో శక్తి సంపన్న వర్గానికి తన శక్తి సామర్థ్యాల పరిచయం, బాధ్యతను గుర్తు చేసి సమాజంలో శ్రేష్ఠ విలువల, సమాజ రక్షణ సంకల్పాన్ని ఇప్పించడమే.

శ్రావణ పౌర్ణిమను భారతదేశంలో అన్నాచెల్లెళ్ళ ప్రేమ, రక్షణకు గుర్తుగా 'రక్షా బంధన్' పండుగగా జరుపుకుంటారు. శ్రావణ మాసంలో జరుపుకునేది కాబట్టి శ్రావణి, సావనీ అని పిలువబడుతోంది. శ్రావణ పూర్ణిమను పశ్చిమ భారతదేశంలో(విశేషంగా కొంకణ్, మలబార్) కేవలం హిందువులు మాత్రమే గాక ముస్లింలు, పార్శీలు సముద్ర తీరానికి వెళ్ళి సముద్రానికి పుష్పాలు సమర్పించి, కొబ్బరికాయ కొడతారు. శ్రావణ పౌర్ణిమ రోజున సముద్రంలో తుఫాన్లు తక్కువగా వస్తాయి. అందుకే వ్యాపార నౌకలు సురక్షితంగా ఉంటాయనే ఉద్దేశ్యంతో సముద్రుడికి కొబ్బరికాయ కొట్టడం జరుగుతుంది. ముంబైలో సముద్రతీర ప్రాంతంలో రక్షాబంధనాన్ని 'కొబ్బరి పూర్ణిమ' లేదా 'కోకోనట్ ఫుల్‌మూన్' అనే పేరుతో వ్యవహరించడం ఉంది. బుందేల్ ఖండ్‌లో రక్షాబంధనాన్ని 'కజరీ పూర్ణిమ' అని కూడా పిలుస్తారు. ఆ రోజున గిన్నెలో బార్లీ లేదా వడ్లను నాటడం జరుగుతుంది. ఏడు రోజులు నీరు పోయడంతో పాటు, భగవతీ మాతకు వందనం చేయడం జరుగుతుంది. 1905లో ఆంగ్లేయులు బెంగాల్ విభజనకు పూనుకోగా రవీంద్రనాథ ఠాగూర్ బెంగాలీల మధ్య పరస్పర సోదరభావనకు ప్రతీకగా రక్షాబంధనాన్ని ప్రచారం చేసి, రాజకీయ ఆయుధంగా ప్రయోగించారు. ఏదిఏమైనా, రక్షాబంధన్ అనేది బంధాలకే కాదు రక్షణకు గుర్తు అని చెప్పకనే చెబుతోంది.



రక్షా బంధనం అనేది విశ్వాసానికి సంబంధించిన పండుగ. ఈ ఉత్సవం ద్వారా సంఘం కోట్లాది స్వయంసేవకుల మాధ్యమంగా సమాజంలో విశ్వాసాన్ని పునర్నిర్మించే ప్రయత్నం చేస్తోంది. రక్షాబంధన్ ఉత్సవంలో స్వయంసేవకులు పరమ పవిత్ర భగవాధ్వజానికి రక్షాసూత్రం కట్టి సంకల్పాన్ని స్మరించుకుంటారు. ధర్మో రక్షతి రక్షిత: అన్నదే ఆ సంకల్పం. సమాజంలోని విలువలను రక్షించాలి. మన శ్రేష్ఠ పరంపరలను రక్షించాలి. అపుడే ధర్మం సంపూర్ణ సమాజాన్ని రక్షించడంలో బలశాలి అవుతుంది. ఇది ధర్మపు వ్యవహారిక పక్షం. మన వ్యవహారంలో ప్రపంచ కళ్యాణకారకమేది ఉందో అది ధర్మం. ధ్వజానికి రక్షాసూత్రం కట్టడంలోని ఉద్దేశ్యం కూడా ఇదే. స్వయంసేవకులు ఒకరితో ఒకరు స్నేహ సూత్రం కట్టుకుంటారు. రక్షాబంధనమనే స్నేహసూత్రం కులం, మతం, భాష, ధనం, విద్య, సామాజిక ఉచ్ఛనీచభేదాలను తొలిగిస్తుంది. ఈ సూత్రాన్ని కట్టుకున్నప్పటి నుండి స్వయంసేవకులు పరస్పరం ఆత్మీయ భావనతో బంధింపబడతారు.

స్వయంసేవకులు తమ సమాజంలోని వేర్వేరు బస్తీలకు వెళ్ళి తరతరాలుగా వంచితులుగా, ఉపేక్షితులుగా పిలవబడేవారికి రక్షాసూత్రం కడతారు. వంచితులు, ఉపేక్షితుల మధ్య కూర్చొని వాళ్ళకు రక్షాబంధన్ కట్టడమేగాక, శ్రీకృష్ణుడు చెప్పిన 'సమానం సర్వభూతేషు' అనే మాటలను వల్లె వేస్తారు. దీని వెనుక ఉద్దేశ్యం ఏమిటంటే, సంపూర్ణ సమాజపు రక్షణను, సంపూర్ణ సమాజమే వ్రతంలా స్వీకరించాలి. శక్తివంతమైన, సమరసత, సంస్కారంతో కూడిన సంపన్న సమాజమే ఏ దేశపు శక్తికైనా ఆధారమవుతుంది. సంఘం ఆ సమాజ నిర్మాణ పనిలోనే ఉంది. రక్షాబంధన్ ఉత్సవం ఈ మహోద్యమపు చరణ రూపం.

## ఇంటింటా భరతమాత పూజలు

సమరసత, స్వదేశీ, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు, కుటుంబ విలువల జాగరణ – అనే ఐదు అంశాలలో పరివర్తన కోసం నిరంతర ప్రయత్నం చేయడానికి అడుగు ముందుకు వేద్దాం. ఈ ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవం, రక్షాబంధన్ నుంచి ప్రారంభించి ఒక్కొక్కరు 10 నుంచి 15 ఇళ్ళను ప్రతి నెలా ఆత్మీయంగా సందర్శిద్దాం. వేలాది ఇళ్లలో భరతమాత పూజ చేయించి, దేశ ధర్మ రక్షా సంకల్పంతో రక్షాబంధన్ చేయిద్దాం. ప్రతి ఇంటికీ భారతమాత చిత్రపటంతో పాటు దేశభక్తిని, ధర్మానురక్తిని మనకు తెలిపే విషయాలతో నిండిన 'వందనీయ జననీ ఓ భారతావనీ' అనే పుస్తకాన్ని చేర్చుదాం.




## హిందూపురంలో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహావిష్కరణ

మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ భారీ విగ్రహాన్ని శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో ఘనంగా ఆవిష్కరించారు. శివాజీ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు చలపతి, వానరసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేదమంత్రోచ్చారణల మధ్య హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో భారతీయ సంస్కృతి ప్రచారకర్త కమలానంద భారతీ స్వామీజీ, శివసాయిబాబా, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ సుస్థిర పాలన, దేశభక్తి, ధైర్యం, క్రమశిక్షణ, ప్రజాసేవకు ఆదర్శప్రాయుడని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకోగా, అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.



## హొళగుందలో భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠాపన

కర్నూలు జిల్లా హొళగుంద మండల కేంద్రంలో భక్త కనకదాసు నూతన విగ్రహ, కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దమ్మూరు గోవర్ధననందపురి స్వామి, మదిరే యల్లా లింగామఠం నాగరాజు స్వామి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న చెరువు సమీపంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠాపన వేడుకల్లో భాగంగా గ్రామంలో భక్త కనకదాసు చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. గజ్జెల్లి చిన్నారుల కోలాట ప్రదర్శన, భజన బృందాల కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



## ఉండ్రాజవరంలో బౌద్ధ విహారం ప్రారంభం



పవిత్ర క్షేత్రం బుద్ధగయలోని మహాబోధి బౌద్ధారామాన్ని నమూనాగా తీసుకుని తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో నిర్మించిన మైత్రేయ బుద్ధవిహార్ లో బుద్ధ భగవానుడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను జూలై 28న వైభవంగా నిర్వహించారు. బౌద్ధ దమ్మ పీఠాధిపతి బంతె అనాలయోతో పాటు తైవాన్, వియత్నాం తదితర దేశాల నుంచి వచ్చిన పీఠాధిపతులు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఉండ్రాజవరంలో ర్యాలీ జరిపారు. ఈ బుద్ధ విహార్‌ను 5 ఎకరాల విస్తీర్ణంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించారు.

# వీరమాత జిజియా

ఒక బాలిక తన తండ్రితో పాటు ప్రతి రోజూ ఉదయం తమ ఇంటికి సమీపంలో ఉన్న శివాలయానికి వెళ్లేది. తన ఆరాధ్య దైవమైన మహాదేవుడికి అభిషేకం, పూజలు చేసేది. శివ పూజ ముగిసిన తర్వాతే తన దైనందిన కార్యక్రమాలు ప్రారంభించేది. ఒకరోజు మధ్యాహ్నం ఒక రాజ భటుడు వారి ఇంటికి వచ్చి బాలిక తండ్రికి ఒక లేఖను అందజేశాడు. అనంతరం ఆ భటుడు నేరుగా అక్కడి శివాలయంలోకి వెళ్లి, ఆ తండ్రీ కూతుళ్ల ఆరాధ్య దైవమైన శివలింగంపై మూత్ర విసర్జన చేశాడు. దీన్ని గమనించిన ఆ బాలిక తన తండ్రి వద్దకు వెళ్లి అతను చేసిన అప్రాచ్యపు పనిని వివరించింది. అతడిని శిక్షించమని తొందరపెట్టింది. కానీ ఒక సాధారణ ఉద్యోగి అయిన ఆ తండ్రి, మనం ఏమీ చేయలేని పరిస్థితి. సర్దుకుపోవాలి అని కూతురికి సర్ది చెప్పాడు. తర్వాత ఆ బాలిక యవ్వనవతి అయింది.



ఆమెకు ఒక రాజ ఉద్యోగితో వివాహం జరిపించారు. కొంతకాలం తర్వాత ఆ దేశ నవాబు ఆమె తండ్రిపై చేయని నేరం మోపి, శిరచ్ఛేదం చేయించాడు. ఉక్రోషం పట్టలేక ఆ యువతి తన భర్త దగ్గరకు పరుగు పరుగున వెళ్లి, తన తండ్రిని చంపించిన నవాబుపై పగ తీర్చుకుందామని కోరింది. అయితే ఆమె భర్త ప్రస్తుత పరిస్థితుల్లో మనం నిస్సహాయులం. మన దుఃఖాన్ని, ఆక్రోశాన్ని మనలోనే అణుచుకోవాలి అని ఓదార్చాడు. అయితే ఆ మాటలు ఆమెను శాంతపరచలేదు. ప్రతి రోజూ ఆలయానికి వెళ్లి పూజలు చేస్తూ, తన గర్భంలో జన్మించమని ఆ పరమేశ్వరుడిని కోరుకునేది. ఆమె పూజలకు మెచ్చిన శివుడు ఆమెకు ఒక కుమారుడు జన్మించేలా దీవించాడు. ఆ బాలుడు చిన్న వయసులోనే శత్రు రాజులకు చెందిన అనేక కోటలను వశపరుచుకున్నాడు. తండ్రి, భర్త ద్వారా తీర్చుకోలేని ప్రతీకారాన్ని కొడుకు ద్వారా తీర్చుకున్న ఆ మాతృమూర్తే జిజియా.

# మృత్యుంజయ క్షేత్రం జుత్తిగ




పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం జుత్తిగ గ్రామంలో కొలువై ఉన్న అత్యంత పురాతనమైన, చారిత్రక శైవ క్షేత్రం శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి దేవస్థానం. ఈ ఆలయం మృత్యుంజయ క్షేత్రంగా ప్రసిద్ధి గాంచింది. వాయు పురాణంలో ఈ క్షేత్రాన్ని దక్షిణ కాశీగా అభివర్ణించారు. ఇక్కడ స్వామివారిని దర్శించుకుంటే కాశీ విశ్వనాథుడిని దర్శించుకున్నంత పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. త్రేతాయుగంలో రావణాసురుడి పీడ నుంచి విముక్తి పొందేందుకు, బ్రహ్మదేవుని ఆదేశం ప్రకారం ఉమాదేవి, నాగరాజు వాసుకి, సూర్యుడు (రవి), చంద్రుడు (సోముడు) ఈ శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అందుకే ఇక్కడి స్వామికి “శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి” అనే పేరు వచ్చింది. ఈ ఆలయంలో సోమేశ్వర స్వామి పశ్చిమాభిముఖంగా కొలువై ఉండటంతో పాటు గోస్తనీ నది ఉత్తర వాహినిగా ప్రవహించడంతో ఈ క్షేత్రాన్ని దక్షిణ కాశీగా పిలుస్తారు. ఇక్కడ ఉన్న శాసనాల ప్రకారం ఈ ఆలయాన్ని 1583లో సత్తిరాజు వంశస్తులు పునరుద్ధరించినట్లు తెలుస్తోంది. ఈ ఆలయ ప్రాంగణంలో మృత్యుంజయ హోమం, అభిషేకాలు జరిపిస్తే ఆపదలు తొలగిపోతాయని, స్వామిని దర్శిస్తే శత్రు, రుణ, రోగ బాధలు ఉండవని భక్తుల నమ్మకం. కార్తీక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఆలయానికి వస్తారు. ఇక్కడి దేవస్థానం ప్రాంగణంలో పది ఉపాలయాలు ఉండటం మరో ప్రత్యేకత. ఈ క్షేత్రం చరిత్ర, ఇతర విశేషాలను ఇక్కడి రాతి స్తంభాలపై దేవ నాగర లిపిలో లిఖించారు. తణుకు నుంచి సుమారు 15 కిలోమీటర్లు,



భీమవరం నుంచి సుమారు 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రాహ్మణచెరువు గ్రామానికి బస్సు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో ఈ ఆలయానికి చేరుకోవచ్చు. నత్తారామేశ్వరం కూడలి నుంచి కూడా ఆటోలు అందుబాటులో ఉంటాయి.

# సామాజిక సమానత్వానికి చిరునామా శ్రీనారాయణగురు

**ఒ**కే కులం... ఒకే మతం... ఒకే దేవుడు... మానవ జాతి కోసం- అనే మహోన్నత సందేశంతో భారత సమాజానికి కొత్త దిశానిర్దేశం చేసిన మహనీయుడు శ్రీ నారాయణగురు. ఆధ్యాత్మికతను సామాజిక సంస్కరణతో మేళవించి, అణగారిన వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన మహర్షిగా ఆయన భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఈ సంవత్సరం ఆగస్టు 28న ఆయన జయంతి జరుపుకుంటున్నాము. 1856లో కేరళలోని చెంపజంతి గ్రామంలో జన్మించిన శ్రీ నారాయణ గురు చిన్ననాటి నుంచే అసాధారణమైన మేధస్సు, ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేకత చాటుకున్నారు. మలయాళం, తమిళం, సంస్కృత



భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన ఆయన, తల్లిదండ్రుల మరణానంతరం ఆధ్యాత్మిక సాధనలో నిమగ్నమయ్యారు. కానీ ఆయన ఆధ్యాత్మికత వ్యక్తిగత మోక్షానికే పరిమితం కాలేదు. సమాజంలో కుల వివక్షతో అణగారిపోతున్న ప్రజల బాధ ఆయనను తీవ్రంగా కలచివేసింది. ఆ కాలంలో కేరళలో కులవ్యవస్థ అత్యంత కఠినంగా అమలులో ఉండేది. దేవాలయ ప్రవేశం, విద్య, సామాజిక గౌరవం వంటి ప్రాథమిక హక్కులు కూడా దిగువ వర్గాలకు అందుబాటులో ఉండేవి కావు. ఈ పరిస్థితుల కారణంగా అనేక మంది ఇతర మతాల్లోకి మారాల్సి వచ్చేది. ఈ సామాజిక దురాచారాలను నిర్మూలించడమే తన జీవిత ధ్యేయంగా శ్రీ నారాయణ గురు నిర్ణయించుకున్నారు. 1888లో తిరువనంతపురం సమీపంలోని అరువిప్పురంలో శివాలయాన్ని నిర్మించి, స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించడం భారత సామాజిక చరిత్రలో ఒక విప్లవాత్మక ఘట్టంగా నిలిచింది. దేవాలయ ప్రతిష్ఠ హక్కును ఆయన సామాజిక సమానత్వానికి ప్రతీకగా మార్చారు. దేవుడు అందరికీ సమానమని, భక్తికి కులం అడ్డుకాదని ఆయన ప్రపంచానికి చాటిచెప్పారు. విద్య ద్వారానే నిజమైన విముక్తి సాధ్యమని బలంగా విశ్వసించారు. స్వాభిమానం, స్వావలంబన, క్రమశిక్షణతో కూడిన జీవితం గడపాలని ప్రజలకు బోధించారు. భారతదేశ సామాజిక చరిత్రలో శ్రీ నారాయణ గురు ఒక యుగపురుషుడు. ఆధ్యాత్మికతను సామాజిక న్యాయంతో మేళవించిన ఆయన భావజాలం నేటి తరానికి ఎంతో అవసరం.

# దేశ చరిత్రపై చెరగని సంతకం పింగళి వెంకయ్య

**ప్ర**తి భారతీయుడి గుండె గర్వంతో ఉప్పొంగే క్షణం ఏదైనా ఉందంటే... అది మన త్రివర్ణ పతాకం రెపరెపలాడే క్షణమే స్వాతంత్ర్య దినోత్సవం. మరి మన జాతీయ పతాకాన్ని రూపొందించిన మహానుభావుడు మన తెలుగు గడ్డపై జన్మించిన పింగళి వెంకయ్య. ఆయన కేవలం జాతీయ జెండా రూపకర్త మాత్రమే కాదు. దేశ స్వాతంత్ర్యాన్ని ముందే ఊహించి, స్వతంత్ర భారతానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలని కలలు కన్న దూరదృష్టి గల మహనీయుడు. భారతదేశానికి ఒక జాతీయ పతాకం అవసరమని భావించి... ఆ కలను నిజం చేయడానికి ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా 20 ఏళ్ల



పాటు పరిశోధన చేశారు. 1876 ఆగస్టు 2న కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపంలోని భట్లపెనుమర్రులో జన్మించిన వెంకయ్య చిన్నప్పటి నుంచే దేశభక్తి భావాలను పెంపొందించుకున్నారు. కేవలం 19 ఏళ్ల వయసులోనే జాతీయోద్యమాల్లో పాల్గొన్నారు. దక్షిణాఫ్రికాలో జరిగిన రెండో బోయర్ యుద్ధంలో సేవలందించే సమయంలో మహాత్మా గాంధీని కలిశారు. ఆ పరిచయం తరువాత ఇద్దరి మధ్య సుదీర్ఘ అనుబంధంగా మారింది. స్వతంత్ర భారతదేశానికి ఒక జాతీయ పతాకం ఉండాలని వెంకయ్య నిర్ణయించుకున్నారు. అందుకోసం ప్రపంచంలోని అనేక దేశాల జాతీయ పతాకాలను అధ్యయనం చేశారు. 1913 నుంచి భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన ప్రతి సమావేశంలో జాతీయ పతాకం అంశాన్ని ప్రస్తావిస్తూ నాయకులను ఒప్పించే ప్రయత్నం చేశారు. 1916లో లక్నోలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఆయన రూపొందించిన జెండాను తొలిసారిగా ప్రదర్శించారు. తరువాత మహాత్మా గాంధీ సూచనలతో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో మధ్యలో రాట్నం గుర్తు ఉన్న జెండాను వెంకయ్య రూపొందించారు. ఆ రాట్నం భారత గ్రామీణ జీవనాన్ని, రైతు శక్తిని, స్వావలంబనను ప్రతిబింబిస్తుందని వివరించారు. 1947 జూలై 22న రాజ్యాంగ సభ జెండాలోని రాట్నం స్థానంలో అశోక చక్రాన్ని చేర్చింది. అప్పటి నుంచి నేటి వరకు మనం గర్వంగా ఎగురవేస్తున్న జాతీయ పతాకం అదే. కాషాయం త్యాగానికి, తెలుపు శాంతికి, ఆకుపచ్చ అభివృద్ధికి ప్రతీకగా నిలవగా... మధ్యలోని నీలి రంగు అశోక చక్రం ధర్మం, న్యాయం, నిరంతర ప్రగతికి సంకేతంగా నిలిచింది. 1963 జూలై 4న ఆయన ఈ లోకాన్ని విడిచిపోయినా... ఆయన సృష్టించిన త్రివర్ణ పతాకం మాత్రం కోట్లాది భారతీయుల హృదయాల్లో ఎప్పటికీ రెపరెపలాడుతూనే ఉంటుంది.

## అరకులో 'ట్రైబల్ ఆర్టిజన్ ఎంపవర్‌మెంట్ మేళా'



**కేం**ద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ట్రైబల్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, పాడేరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అరకు వ్యాలీలోని ఏపీటీడీసీ మీటింగ్ హాల్‌లో వనవాసీ కళాకారుల ఎంపానెల్‌మెంట్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిషాంతి మాట్లాడుతూ, హైదరాబాద్ నుంచి వచ్చిన ట్రైఫెడ్ ఉన్నతాధికారులు స్థానికంగా ప్రదర్శించిన ఉత్పత్తులను పరిశీలించి నాణ్యమైన వాటిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన ఉత్పత్తులను ట్రైఫెడ్ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న విక్రయ కేంద్రాల్లో మార్కెటింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో వనవాసీ కళాకారులకు జాతీయ స్థాయిలో మార్కెట్ లభించి, ఆదాయం పెరిగే అవకాశాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు. వనవాసీ కళాకారుల నైపుణ్యాభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా వచ్చే ఒకటి రెండు నెలల్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేళాలో సుమారు 120 మంది వనవాసీ కళాకారులు పాల్గొని వెదురు ఉత్పత్తులు, లక్క బొమ్మలు, అరకు కాఫీ, తేనె, చిరుధాన్యాలు, నల్ల మిరియాలు, పసుపు, అల్లం, ఊరగాయలు, మట్టి పాత్రలు, సహజ ఆహార ఉత్పత్తులు తదితర వస్తువులను ప్రదర్శించారు.

## మంచి పనిని చేస్తే సమాజంలో గౌరవం

**ఒ**కప్పుడు అవంతిపురం రాజ్యాన్ని నరేంద్ర భూపతి అనే రాజు పరిపాలిస్తుండేవాడు. తన రాజ్యంలో ప్రజలు ఎలా ఉన్నారో పరీక్షించాలని అనుకున్నాడు. ఒకరోజు అర్ధరాత్రి నగరంలోని రహదారి మధ్యలో ఒక పెద్ద బండరాయిని పెట్టించాడు. ప్రజలు ఆ మార్గం గుండా నడుస్తూ –ఎవరు అడ్డం పెట్టారో బుద్ధిలేని వాళ్ళు– అని తిట్టుకుంటూ పక్కనుంచి పోసాగారు. ఇలా రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు ఒక యువకుడు దారికి అడ్డంగా ఉన్న రాయిని చూసి దాన్ని తొలగించాలని ప్రయత్నించాడు .అది ఎంతకూ కదలలేదు. సాయంత్రం తన స్నేహితులను తీసుకొచ్చి వారి సాయంతో ఆ బండరాయిని తొలగించాడు. ఇది చూసిన ప్రజలు అడ్డంగా పెట్టిన వాళ్ళని తిట్టుకున్నాం.. పక్క నుంచి వెళ్లామే తప్ప రాయి తొలగించాలన్న భావన రాలేదు. అందరం కలిసి పక్కకు పెడదామని ఆలోచన తమకు రాలేదని బాధపడ్డారు. తమకు రాని ఆలోచన పిల్లలకు వచ్చిందని ఆనందపడ్డారు. గూఢచారులు ఈ విషయాన్ని రాజు గారికి తెలియజేశారు. అది విన్న రాజుగారు సామాజిక బాధ్యతను గుర్తించిన ఆ పిల్లలను రాజసభకు పిలిచి ఘనంగా సన్మానించారు. మంచి పనిని చేస్తే సమాజంలో గౌరవం పెరుగుతుంది.

**– తులసీ సూర్య ప్రకాశ్**



## వేడుకగా సింహాచలం గిరి ప్రదక్షిణ



**ప్ర**ముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం జూలై 28న అంగరంగ వైభవంగా జరిగింది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగింది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడింది. ఓవైపు చిరు చినుకులు, మరోవైపు మంగళ వాయిద్యాలు, జానపద కళారూపాల నడుమ నమో నారసింహా అంటూ భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. ఈ ఏడాది గిరి ప్రదక్షిణలో పెద్ద ఎత్తున యువత పాల్గొంది. దాదాపు 6 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణ చేశారని అంచనా.

# కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం

విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ ప్రబంధ సమితి రెండు రోజుల సమావేశం జూలై 19, 20 తేదీల్లో ఛతర్‌పూర్‌లోని తేరాపంథ్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా అఖిల భారతీయ స్థాయిలో బాధ్యతలు ఉన్నవారు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమకాలీన జాతీయ, సామాజిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం పలు ముఖ్యమైన తీర్మానాలను ఆమోదించారు. భారతీయ సమాజానికి మూలస్తంభమైన కుటుంబ వ్యవస్థను సురక్షితంగా, సుదృఢంగా ఉంచడంపై ఈ సమావేశంలో ప్రాధాన్యత ఇచ్చారు. భారతీయ కుటుంబ వ్యవస్థ శతాబ్దాలుగా సమాజాన్ని సంస్కారవంతంగా, ఐక్యంగా మరియు ఆత్మీయంగా ఉంచిందని తీర్మానంలో పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఎదురవుతున్న సవాళ్లకు సమాజం, ప్రభుత్వం రెండింటి స్థాయిలోనూ ఓ పరిష్కారం అవసరమని అభిప్రాయపడ్డారు. వివాహేతర సంబంధాలకు గుర్తింపు, లివ్-ఇన్ రిలేషన్లకు చట్టబద్ధత, స్వలింగ సంపర్కానికి గుర్తింపు వంటి కొన్ని న్యాయపరమైన నిర్ణయాలు సాంప్రదాయ కుటుంబ వ్యవస్థను దెబ్బతీశాయని, వీటిపై సమగ్ర చర్చ జరిపి, కుటుంబ వ్యవస్థకు జరుగుతున్న నష్టాన్ని అరికట్టేలా చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ ప్రబోధనం మరియు కుటుంబ విలువల పరిరక్షణ కోసం సమగ్ర ప్రజా చైతన్య ప్రచారాన్ని నిర్వహించాలని విహెచ్‌పి నిర్ణయించింది. అలాగే ఒడిశాలోని కంధమాల్‌లో పూజ్య స్వామి లక్ష్మణానంద సరస్వతి జీ దారుణ హత్యపై విచారణకు ఏర్పాటు చేసిన కమిషన్ నివేదిక మాయమవడం, దానిని బహిర్గతం చేయకపోవడం పట్ల సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై సీబీఐ ద్వారా నిష్పాక్షిక విచారణ జరిపించాలని కేంద్ర నిర్వహణ




కమిటీ డిమాండ్ చేసింది. ఒడిశాలో మత మార్పిడులపై పూర్తి నిషేధం విధించాలని పిలుపునిచ్చింది. సంత్ శిరోమణి గురు రవిదాస్ జీ 650వ జయంతి సందర్భంగా ఒక ప్రత్యేక ప్రకటనను సమావేశంలో ఆమోదించారు. దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించి ఆయన సందేశాన్ని సమాజంలోని ప్రతి వర్గానికి చేరవేస్తామని విహెచ్‌పి సంకల్పించింది. సెప్టెంబరు 27న శ్రీ రామ జన్మభూమి ఉద్యమ నేత అశోక్ సింఘాల్ జీ జయంతి నేపథ్యంలో హిందూ సమాజం కోసం ఆయన చేసిన అసమాన సేవలను ఏడాది పొడవునా సమాజం ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ఆయన శతాబ్ది జయంతి సంవత్సరంలో విశ్వ హిందూ పరిషత్ సంస్థాగత విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఈ సందర్భంగా కోటి మంది హితచింతకులను (సభ్యులను) చేర్పించాలని విహెచ్‌పి సంకల్పించింది. హిందూ సమాజాన్ని ఐక్యం చేయడం, సనాతన విలువలను పరిరక్షించడం, జాతీయ ప్రయోజనాల కోసం చురుగ్గా పనిచేస్తామనే సంకల్పంతో సమావేశం ముగిసింది.

## సీతంపేటలో "ఆగ్రోఫ్రెష్" ఆదివాసీ సేంద్రీయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం

గిరిజన మహిళల ఆర్థిక సాధికారతకు, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహానికి మరో ముందడుగుగా పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో "ఆగ్రోఫ్రెష్" ఆదివాసీ సేంద్రీయ, చిరుధాన్యాల విక్రయ కేంద్రం ప్రారంభమైంది. ఆదివాసీ మహిళా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో, నాబార్డ్, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటైన ఈ విక్రయ కేంద్రం పూర్తిగా గిరిజన మహిళా రైతుల వాటాలతో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. "ఆగ్రోఫ్రెష్" కేవలం ఒక విక్రయ కేంద్రం మాత్రమే కాకుండా గిరిజన మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కేంద్రంలో చిరుధాన్యాలు, చిరుధాన్యాల పిండి, మిల్లెట్ స్నాక్స్, సేంద్రీయ బియ్యం, కొండ తేనె, గానుగ నూనెలు, పప్పుధాన్యాలు, అరకు ఫిల్టర్ కాఫీ, పసుపు కొమ్ములు, పసుపు పొడి తదితర ఆదివాసీ రైతు ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు.




## గ్రహశకలానికి తెలుగు శాస్త్రవేత్త పేరు

**అం**తరిక్షంలోని ఒక గ్రహశకలానికి ఆంధ్రప్రదేశ్ కు చెందిన శాస్త్రవేత్త పేరును అంతర్జాతీయ ఖగోళ సమాఖ్య ఖరారు చేసింది. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపే టకు



చెందిన డాక్టర్ భీరవరసు శ్రీరామ్ శరణ్.. అహ్మదాబాద్ లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన స్పేస్ అప్లికేషన్ సెంటర్ లో ప్లానెటరీ రాడార్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. సౌర కుటుంబంలోని గ్రహాలు, ఉపగ్రహా లపై ఆయన సాగించిన పరిశోధనలకు గుర్తింపుగా ఈ అరుదైన గౌరవం దక్కింది. '1999 ఎక్స్169' అనే గ్రహశకలానికి ఆయన పేరు పెట్టారు. అది అంగారకుడు-గురుడు మధ్య ప్రధాన గ్రహశకల వలయంలో పరిభ్రమిస్తోంది. ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-2 ఆర్బిటర్లోని డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపర్చర్ రాడార్ ద్వారా చంద్రుని ఉపరితలంపై సాగించిన పరిశోధనల్లో శ్రీరామ్ శరణ్ కీలకపాత్ర పోషించారు. శుక్ర గ్రహంపై ఆయన చేసిన పరిశోధనలు ప్రఖ్యాత సైన్స్ పత్రిక 'నేచర్ ఆస్ట్రోనమీ'లో ఇటీవల ప్రచురితమయ్యాయి.

## 41 రోజులపాటు శ్రీవారి పుష్కరిణి మూసివేత



**తి**రుమల శ్రీవారి ఆలయం పక్కన ఉన్న పుష్కరిణిని 41 రోజులపాటు మూసివేయనున్నట్లు టిటిడి ప్రకటించింది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏటా పుష్కరిణికి మరమ్మతులు చేపడతారు. సెప్టెంబర్ 15 నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టిటిడి వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో పనులు చేసేందుకు ఆగస్టు నెలంతా పుష్కరిణిని మూసివేయాలని నిర్ణయించారు. అలాగే భారీ వర్షాలు, తుఫాన్లు, ఇతర పరిస్థితుల కారణంగా సెప్టెంబరు 1 నుంచి 10 వరకు కూడా పుష్కరిణి మూసివేస్తారు.

## గురుదక్షిణ

1972 నాటి సంఘటన. త్వరలో ఉత్తరప్రదేశ్ లోని ఆగ్రా లో గురుపూజ కార్యక్రమం జరుగబోతోంది. స్థానిక ప్రచారక్ శ్రీ శ్యాం జీ గురుదక్షిణ విషయం గురించి శాఖలో వివరించాడు. జయప్రకాశ్ అనే స్వయంసేవకుడు, తన తండ్రినుండి 50 రూపాయలు అడిగి తీసుకువస్తానని చెప్పాడు. అది విన్న శ్రీ శ్యాం జీ , అలా కాదుగానీ నీ దినచర్య, రోజువారీ ఖర్చు గురించి చెప్పమన్నాడు. తాను రోజూ మూడు పాన్ బీడాలు తింటానని, ఒక్కొక్క దాని ధర పదిపైసలు అని చెప్పాడు జయప్రకాశ్. దాంతో శ్రీ శ్యాం జీ , ఈ మొదటి సంవత్సరం ఒక పాన్ బీడాను గురుదక్షిణగా సమర్పించమని జయప్రకాశ్ తో చెప్పాడు. అంటే రోజుకు పదిపైసల చొప్పున సంవత్సరానికి 36 రూపాయలవుతుంది. జయప్రకాశ్ అలాగే చేశాడు. అలా రోజూ తినే పాన్ బీడాలలో ఒకటి తగ్గిపోయింది. రెండవ సంవత్సరం గురుదక్షిణగా 72 రూపాయలు, మూడవ సంవత్సరం 108 రూపాయలు సమర్పణ చేయడం జరిగింది. అలా పాన్ బీడాలు తినే దురలవాటు పూర్తిగా ఆగిపోయింది. గురుదక్షిణ సమర్పించడానికి తండ్రిని విడిగా డబ్బులు అడిగే అవసరం లేకుండా పోయింది జయప్రకాశ్ కు. ఉత్తరప్రదేశ్ కు చెందిన సుశీల్ కుమార్ శుక్లా పెట్టిన పోస్టుకు, కామెంట్ రూపంలో జయప్రకాశ్ గారు రాసిన సొంత అనుభవం.




**చందాదారులుగా చేరండి! చేర్పించండి**

**హిందూ నగారా సంవత్సర చందా రూ. 100/-**

**మీతో పాటుగా మరి కొంతమందిని చందాదారులుగా చేర్పించండి.**

**UNION BANK OF INDIA**
**A/C No. 014511100004775**
**IFSC CODE: UBIN0801453**
**Governorpet Branch,**
**VIJAYAWADA**

## కలుపు మాయం... పాదులు సిద్ధం

**ఉ**ద్యాన పంటల్లో చెట్లకు కలుపు తీయాలన్నా, పాదులు చేయాలన్నా రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనికి ఎక్కువ మంది కూలీలు అవసరం. పంటలకు తగిన ధరలు లేని సమయంలో ఈ పని రైతులకు తలకు మించిన భారం అవుతుంది. పంట దిగుబడికి ఈ పనులు తప్పనిసరి. అలాగే వదిలేస్తే చెట్లు బతకకుండా ఉండే ప్రమాదం కూడా ఉంది. ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కిచ్చేందుకు ఒక ప్రత్యామ్నాయ పరికరాన్ని మెకానికల్ అడ్వాంటేజ్ అనే సూత్రంతో ప్రొఫెసర్ ముప్పా లక్ష్మణరావు తయారు చేశారు. తక్కువ శ్రమతో, ఎక్కువ పని చేసేలా ఈ యంత్రానికి రూపకల్పన చేశారు. ఉద్యాన పంటల్లో చెట్టు చుట్టూ పాదులు చేయడానికి ఈ పరికరం కోసం ఒక పొడవాటి ఇనుప పైపును తీసుకొని చక్రాకారంలో వంచి కింద భాగాన చిన్నపాటి కర్రులు అమర్చారు. వెల్డింగ్ ద్వారా అనుసంధానం చేసి పరికరాన్ని తయారుచేశారు. దీనిసాయంతో చెట్టు వద్ద ఐదు నిమిషాల్లోనే కలుపు, పాదు రెండూ చేసుకోవచ్చు. ఉద్యానవన పంటల్లో అంతర్ కృషి పరికరం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నలుగురు చేసే పని ఒక మనిషి గంట వ్యవధిలోనే చేసే అవకాశం ఉంటుంది. మామిడి, అరటి, బత్తాయి, జామ, నేరేడు, నిమ్మ పంటలకు ఇది ఉపయోగకరం. ట్రాక్టర్లు ఎద్దుల సహాయంతో రైతులు ఈ పంటల్లో కలుపు తీసే కార్యక్రమం చేస్తుంటారు. అయితే చెట్టు పాదులో అంతర్ కృషి చేయాలంటే మనుషుల సహాయం అవసరం ఉంటుంది. ఈ పరికరాన్ని చెట్టుకు అమర్చి ఒక వ్యక్తి చుట్టూ తిరగడం వల్ల గుంటకు తరహాలో మడకలు భూమిని చదును చేయడంతో పాటు పాదు ఏర్పడుతుంది. దీనివల్ల రైతులకు ఎంతో ఖర్చు మిగులుతుంది. శ్రమ తక్కువగా ఉండటంతో పాటు ఒక్క మనిషి గంట వ్యవధిలోనే అర ఎకరా పొలం పూర్తి చేయవచ్చు. ఈ పరికరం వ్యయం రూ.4 వేల వరకు ఉంటుంది. చెట్టు పరిమాణాన్ని బట్టి పరికరం ధర మారుతుంది. ఈ పరికరానికి పేటెంట్ నంబరు: 507641-001. అవసరమైన రైతులు కోరితే దీన్ని తయారుచేసి ఇస్తామని శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్, రైతునేస్తం ముప్పా లక్ష్మణరావు తెలిపారు.



**- ముప్పా లక్ష్మణరావు**

## నేవీ అమ్ములపొదిలోకి -మచిలీపట్నం- యుద్ధనౌక

**భా**రత నౌకాదళం కోసం -మచిలీపట్నం- అనే పేరుతో కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థ నిర్మించిన జలాంతర్గామి విధ్వంసక నౌక జూలై 30న లాంఛనంగా ప్రారంభమైంది. భారత్ నిర్మిస్తున్న జలాంతర్గామి విధ్వంసక నౌకల పరంపరలో ఇది ఏడోది. ఈ సిరీస్‌లో మొత్తం ఎనిమిది నౌకలు నిర్మించాలన్నది లక్ష్యం. సముద్ర గర్భంలో నిఘా ఉంచేందుకు, జలాంతర్గాముల విధ్వంసానికి, తక్కువ శ్రేణి సముద్రయాన కార్యకలాపాలకు కావాల్సిన సామర్థ్యాన్ని ఈ నౌక కలిగి ఉంటుందని రక్షణ శాఖ ప్రకటించింది. తూర్పు తీరంలో పరిఢవిల్లిన ఆంధ్రప్రదేశ్ రేవు పట్టణమైన మచిలీపట్నం పేరుతో ఈ నౌకను నిర్మించినట్టు అధికారులు తెలిపారు. సైనిక వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి వైస్ అడ్మిరల్ అతుల్ ఆనంద్ సమక్షంలో ఈ నౌకను ప్రారంభించారు. ఈ నౌక చేరికతో భారత్ సముద్ర తీరప్రాంతాల్లో నావికాదళ శక్తి రెట్టింపైంది. మాహే శ్రేణికి చెందిన ఈ సబ్‌మెరైన్ వ్యతిరేక నౌక సాధారణ నావల కంటే వేగంగా, అత్యంత చాకచక్యంగా పనిచేస్తుంది. సముద్రంలో తక్కువ లోతు ఉన్న ప్రాంతాల్లో సైతం నిశ్శబ్దంగా సంచరించే శత్రువుల సబ్‌మెరైన్‌లను గుర్తించడం, అలాగే బాంబులను నాశనం చేయడం దీని ప్రత్యేకత. అత్యాధునిక రాడార్లు, నీటి లోపల నిఘా పెట్టే సోనార్ వ్యవస్థలు, స్వదేశీ ఆయుధాలతో రూపుదిద్దుకున్న ఈ నౌక మన జల సరిహద్దుల రక్షణలో కీలకంగా మారనుంది. కొచ్చిన్ షిప్‌యార్డ్ నిర్మించిన 'మాళ్వాన్' అనే మరో యుద్ధనౌకను కూడా నావికాదళం కొద్ది రోజుల క్రితమే తమ దళంలోకి చేర్చుకుంది. కృష్ణా జిల్లాకు చెందిన చారిత్రక నౌకాశ్రయం 'మచిలీపట్నం' పేరును ఈ అత్యాధునిక యుద్ధనౌకకు పెట్టడం తెలుగువారందరికీ గర్వకారణం.




### ఈ నెల పద్యము



**॥ సరసము విరసము కొఱకే**
**పరిపూర్ణ సుఖంబు లధిక బాధల కొఱకే**
**పెరుగుట విరుగుట కొఱకే**
**ధర తగ్గుట హెచ్చుట కొఱకె తథ్యము సుమతీ! ॥**

**భావము:** మనసుకు ఆనందం కలిగించేలా మాట్లాడటం, చేష్టలు చేయడం ఇలాంటివన్నీ దుఃఖం కలగటానికే. పరిపూర్ణ సుఖం కలగడం అంటే ఎక్కువ కష్టాలు అనుభవించటానికే. వృద్ధి చెందటం అంటే క్షీణించటం కోసమే. అలాగే ఒక వస్తువు ధర ఎక్కువగా తగ్గటం మళ్లీ పెరగడం కోసమేనని తెలుసుకోవాలి.

# ఆకుకూరలతో చక్కటి ఆరోగ్యం

**గోం**గూర... హైబిస్కస్ జాతి కి చెందినది. ఎంతో రుచికరంగా ఉండే గోంగూర పచ్చడిపై ఆంధ్రులకు మక్కువ ఎక్కువ. ఇందులో ఐరన్ ఉంటుంది. దీనిని నంజు వస్తువు అంటారు. అలర్జీలను వ్యాప్తి చేసే గుణం కారణంగా చర్మ సంబంధిత, శ్వాసకోశ వ్యాధులు, రక్త మొలలతో బాధపడేవారు దీనిని అధికంగా ఉపయోగించరాదు.

**పాలకూర..** స్పినేషియా జాతికి చెందిన ఈ ఆకుకూర శీతగుణం కలిగి కఫాన్ని పెంచుతుంది. కంటికి మంచిది. ఇందులో ఉన్న కాల్షియం ఎముకలకు బలాన్నిస్తుంది. ఇందులో కాల్షియం ఆక్సేట్ క్రిస్టల్ లు ఉన్నదున మూత్రాశయంలో రాళ్లు ఉన్నవారు వాడరాదు.



**చుక్క కూర...** ఇది రుచికి పుల్లగా ఉండి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. గర్భవతులలో వేవిళ్ళు తగ్గడానికి బాగా ఉపయోగపడుతుంది.

**తోటకూర..** అమరాంతే జాతికి చెందిన పోషక విలువలు ఎక్కువగా ఉన్న ఆకుకూర ఇది. దీనిలో ఏ -విటమిన్ అధికం. మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారు దీనిని వాడరాదు. ఫైబర్ అధికంగా ఉండట వల్ల దీన్ని ఎక్కువగా తీసుకుంటే మలబద్ధకం తగ్గుతుంది.

**పొన్నగంటి కూర..** కంటిచూపును మెరుగు చేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చర్మవ్యాధుల నుంచి కాపాడుతుంది. దీని ఆకును దంచి గాయాలపై కట్టు కడితే త్వరగా నయమవుతాయి.

**చిర్రి కూర...** విష దోషాలను పోగొడుతుంది. దీని కూర వండుకొని తినడం వల్ల విష ప్రభావం దూరమవుతుంది. స్త్రీలలో వచ్చే శ్వేత ప్రదరం (తెల్ల బట్ట సమస్య)లో దీని వేరు చూర్ణం, తేనె, బియ్యపు కడుగుతో ఇవ్వవచ్చు.

# ఉప్పు బస్తా ఆట

**ఉ**ప్పు బస్తా అనేది ఆంధ్రప్రదేశ్, ఇతర ప్రాంతాల్లో పిల్లలు ఆడుకొనే ఒక సంప్రదాయ దేశీయ అవుట్‌డోర్ ఆట. ఈ ఆటలో ఒక ఆటగాడు మరొక ఆటగాడిని వీపుపై మోస్తాడు. అందుకే దీనికి ఉప్పు బస్తా అనే పేరు వచ్చింది. ఇది పిల్లల్లో బలం, సమతుల్యత, చురుకుదనం, జట్టు సహకారాన్ని పెంపొందించే సంప్రదాయ గ్రామీణ ఆట. ముందుగా ఆటగాళ్లను రెండు జట్లుగా విభజిస్తారు. ప్రతి జట్టులో ఇద్దరు కలిసి ఒక జంటగా ఉంటారు. ఒక ఆటగాడు తన జట్టు సభ్యుడిని వీపుపై మోస్తాడు. వీరిద్దరూ నిర్ణయించిన గీత వరకు వెళ్లి తిరిగి రావాలి. ముందుగా పూర్తి చేసిన జట్టుకు పాయింట్ ఇస్తారు. తర్వాత మోసే ఆటగాడు, మోయించుకునే ఆటగాడు స్థానాలు మార్చుకుని మళ్లీ ఆడతారు. మధ్యలో కిందికి దించకూడదు. నిర్ణయించిన మార్గంలోనే వెళ్లాలి. తోసుకోవడం లేదా అడ్డుకోవడం చేయకూడదు. ప్రతి జట్టుకు సమాన అవకాశాలు ఇవ్వాలి. అత్యల్ప సమయంలో నిర్ణయించిన దూరాన్ని పూర్తి చేసిన లేదా ఎక్కువ పాయింట్లు సాధించిన జట్టు విజేతగా నిలుస్తుంది. పిల్లలు ఈ ఆట ఆడటం ద్వారా వారి శారీరక బలం పెరుగుతుంది. సమతుల్యత, సహనం మెరుగుపడతాయి. జట్టు భావన పెరుగుతుంది. పరస్పర సహకారం, నమ్మకం అభివృద్ధి చెందుతాయి. గ్రామాల్లో వేసవి సెలవుల్లో, పాఠశాల క్రీడా కార్యక్రమాల్లో పిల్లలు ఈ ఆటను ఎంతో ఉత్సాహంగా ఆడేవారు. ప్రస్తుతం కూడా కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడల పోటీల్లో ఈ ఆటను నిర్వహిస్తున్నారు.




– బలరాం

# అయోధ్యలో రామానందీ సంప్రదాయాన్ని అనుసరిద్దాం

**అ**యోధ్య గౌరవ ప్రతిష్ఠల్ని పునరుద్ధరించేందుకు తీసుకోదగిన చర్యలపై చర్చించేందుకు జూలై 23న ఏర్పాటు చేసిన సమావేశంలో 250 మఠాలు, అఖాడాల అధిపతులు, విశ్వ హిందూ పరిషత్ నేతలు పాల్గొన్నారు. ఆలయంలో వైష్ణవ రామానందీ సంప్రదాయానికి సంబంధించిన పూజా విధానాన్ని అనుసరించాలని వారు పిలుపునిచ్చారు. సనాతన ధర్మం అనుసరిస్తున్న వారందరినీ ఏకం చేయాలని, దాని ప్రతిష్ఠను దిగజార్చుతున్న వారికి వ్యతిరేకంగా నిలబెట్టాలని ఈ సందర్భంగా ఏకాభిప్రాయం వ్యక్తమైంది.




# మానవాళికి ఆదర్శప్రాయుడు గౌతమ మహర్షి



వేదకాలానికి చెందిన మహర్షులలో ఒకడైన గౌతముడు సప్తర్షులలో ఒకడు. గౌతమ గోత్రానికి మూలపురుషుడు. మంత్రాల సృష్టికర్తగా సుప్రసిద్ధుడు. ఋగ్వేదంలో ఈయన పేరు మీదుగా అనేక సూక్తులు ఉన్నాయి. భరద్వాజుడు, ఈయన అంగీరస మూలానికి చెందిన వారే. దేవీ భాగవతం ప్రకారం, గోదావరి నది గౌతముడి పేరు మీదుగా వచ్చింది. ఈయన భార్య పేరు అహల్య. ఈమె బ్రహ్మ మానసపుత్రిక. మిథిలా నగరానికి రాజైన జనకుడి కొలువులో ప్రధాన ఆచార్యుడు శతానంద మహర్షి ఈయన పుత్రుడు. గౌతముడు ఆచరించిన 60 సంవత్సరాల తపస్సు గురించి మహాభారతంలోని శాంతి పర్వములో ప్రస్తావించారు. ఒకసారి ఏకధాటిగా 12 ఏళ్ళు కరువు ఏర్పడగా గౌతముడు ఋషులందరినీ పోషించి వారిని రక్షించాడని నారద పురాణం పేర్కొంటోంది. గౌతముడు రచించిన ధర్మసూత్రాలు ఆయన పేరు మీదుగా గౌతమ ధర్మ సూత్రాలుగా ప్రఖ్యాతి చెందాయి. వీటినే మొట్టమొదటి ధర్మ సూత్రాలుగా చెబుతారు. గౌతముడు రాసిన ధర్మసూత్ర గ్రంథంలో 28 అధ్యాయాలు, 1,000 సూత్రాలూ ఉన్నాయి. నాలుగు ఆశ్రమాలూ, 40 సంస్కారాలూ, చాతుర్వర్ణాలు, రాజధర్మాలు, శిక్షాస్మృతులు, స్త్రీలు పాటించాల్సిన ధర్మాలు, ఆహార నియమాలు, ప్రాయశ్చిత్తానికి నియమాలు మొదలైన హిందూ ధర్మ శాస్త్రంలోని అన్ని దృక్కోణాలు ఇందులో ఉన్నాయి. ఈ విధంగా గౌతమ ధర్మ శాస్త్రమనేది అత్యంత పురాతనమైన న్యాయశాస్త్ర గ్రంథంగా చెప్పవచ్చు. భూతదయ, నిరహంకారం పరోపకారం ఇంద్రియ నిగ్రహం అనే గుణాలు నిండుగా ఉన్న గౌతముడు ఆదర్శ పురుషుడు. సకల ధర్మరహస్యాలు తెలిసినా పండితుల వద్దకు వెళ్ళి ప్రాయశ్చిత్త విధానము తెలుసుకొని తన వినయ వైభవాన్ని చాటినాడు. ప్రకృతిని క్షోభించకుండా మానవ కళ్యాణం సాధించే విజ్ఞానం భారతీయులది. గౌతముడు భౌతిక విజ్ఞానానికి దైవిక శక్తిని జోడించి ప్రజాశ్రేయస్సుకు కృషి చేశాడు. ఆయన వ్యవసాయ భూ జల శాస్త్రాలలో కూడా నిపుణుడు. అహల్యా గౌతమ దంపతులు నిరంతర అతిథిసేవా పరాయణులు. గౌతముడు తన వ్యవసాయ విజ్ఞానంతో శిష్యుల సహాయముతో వరి, కాయగూరలు మొదలైన పంటలు పండించేవాడు. అహల్య వాటిని వండి అన్నార్తుల ఆకలి తీర్చేది. ఈ దంపతులు అసామాన్యమైన అతిథి సేవ చేసి మనకు మార్గదర్శకులుగా నిలిచారు.

# కండరాలకు శక్తినిచ్చే అర్ధచంద్రాసనం



అర్ధ అంటే సగం అని అర్థం. ఆసనం అంటే యోగాలో చేసే పరిక్రియ. ఇది శరీరం సమతుల్యంగా, బలంగా ఉండటానికి వేసే ఒక ముఖ్యమైన యోగాసనం. ఈ ఆసనం తుంటి, తొడ కండరాలను బలంగా ఉంచి పిక్క కండరాలకు శక్తిని ఇస్తుంది.

**చేసే విధానం:** ఒకే పాదం ఒకే చేయి మీద శరీరాన్ని బ్యాలెన్స్ చేసే భంగిమ ఇది. ముందుగా మ్యాట్ పైన ధ్యానంలో కూర్చొని శరీరాన్ని మనసును ఆసనం వేయడానికి సిద్ధం చేయండి. ఆపై నిదానంగా నిలబడి కుడి పాదాన్ని కుడి పక్కకు తిప్పి, మోకాలిని కొంచెం వంచి కుడి హస్తాన్ని కుడి పాదం ముందుగా తగిన దూరంలో ఆన్చి ఉంచండి. ఇప్పుడు నెమ్మదిగా ఎడమ పాదాన్ని నేల నుంచి సమాంతరంగా పైకి లేపండి. అదే విధంగా శరీరాన్ని బయటవైపుగా తెరిచి ఉంచి మీ ఎడమ చేతిని ఆకాశం వైపుగా పైకి చాచి ఉంచండి. ఇది పూర్తిగా బ్యాలెన్సింగ్ ఆసనం. ఈ స్థితిలో 10-12 సెకన్లు ఉండే ప్రయత్నం చేసి నిదానంగా యథాస్థానానికి రండి. ఇలా ఒక పక్క చేసిన తర్వాత మరోపక్క ఆసనాన్ని పునరావృతం చేయండి. ఒకవేళ పాదం పక్కనే హస్తం ఆనక ఇబ్బందిగా ఉంటే యోగా బ్రిక్ సాయంతో లేదా స్టూల్ సాయంతో ఆసనాన్ని చేయొచ్చు.

**ఇవీ ప్రయోజనాలు:** తొడ, చీలమండలను బలపరుస్తుంది. పిరుదుల దగ్గర ఉన్న కొవ్వును కరిగిస్తుంది. పొట్ట కండరాలను బలపరుస్తుంది. శరీరాన్నీ, మనసునీ బ్యాలెన్స్ చేస్తుంది.

ఎవరు చేయకూడదు: తుంటి, మోకాళ్లు, మడం, మణికట్టు సర్జరీలు అయినవాళ్లు, తల తిరుగుడు సమస్య ఉన్నవారు ఈ ఆసనం వేయకూడదు.


**హిందూనగారా పాఠకులకు విజ్ఞప్తి**

హిందూ నగారాలో ప్రచురించబడుతున్న వార్తలు, వ్యాసాలపై మీ అభిప్రాయాలను ఈ క్రింది ఫోన్ నెంబరుకు వాట్సప్ ద్వారా కానీ, ఫోన్ చేసి కానీ తెలుపవచ్చు. అలాగే మీ మీ ప్రాంతాలలో జరిగే హిందుత్వ ప్రాధాన్యత కలిగిన సంఘటనలను కూడా మాకు తెలియపరచవచ్చు.

మీరు ఫోన్ / వాట్సప్ చెయ్యవలసిన నెంబర్ : 8333812685

# సీతా మనోహరుడు కోదండరాముడు

ఆంజనేయుడు అశోకవనంలో ఉన్న సీతమ్మను చూసి, రావణుడు అపహరించడం వల్ల ఈమె కనబడకపోయినా, రాముడి మనసులో మాత్రం స్థిరంగా ఉంది అనుకుంటాడు. అదే విధంగా ఈ సీతాదేవి మనసు కూడా రాముడిపై లగ్నమై ఉంది. అందుకే వీరిద్దరూ ఒకరిపై ఒకరు ఆశ పెట్టుకొని జీవించగలుగుతున్నారు అని భావిస్తాడు. ఆంజనేయుడు సీతకు ఆమె వియోగంతో రాముడు ఏవిధంగా పరితపిస్తున్నాడు వివరిస్తాడు. రాముడి మనసు పూర్తిగా సీతపైనే నిలిచి ఉండటంతో అతను తన శరీరంపై వాలే అడవి ఈగలను కానీ, దోమలను కానీ, శరీరంపై పాకే పురుగులను కానీ, సర్పాలను కానీ తొలగించుకోవడం లేదట. సీతమ్మ క్షేమంగా ఉందన్న వార్తను హనుమ చెప్పిన తర్వాత రాముడు లక్ష్మణుడితో మాట్లాడుతూ, ఆమె జీవించి ఉందని వినడంతో నీళ్లు లేని వరిచేను నీళ్లున్న వరిచేను పక్కనే ఉండటంతో దాని తడి తగిలి జీవించినట్లు తాను కూడా జీవిస్తున్నానని చెబుతాడు. తాను, ఆమె ఒకే భూమిపైన ఉన్నామనే విషయమే తనకు జీవితాశ కలిగిస్తోందని అంటాడు. ఇంద్రజిత్తు మాయా సీతను చంపినప్పుడు ఆమె నిజమైన సీతే అనుకొని రాముడు మూర్ఛపోతాడు. వీటన్నింటికంటే ఎక్కువగా జనాపవాదానికి భయపడి సీతను అడవికి పంపిన తర్వాత అశ్వమేధ యాగం చేసినప్పుడు భార్య స్థానంలో బంగారు సీత ప్రతిమను నిలుపుతాడు. ఆమె భూమాత ఒడిలోకి చేరిన తర్వాత కూడా రాముడు చేసిన యజ్ఞాల్లో ఈ స్వర్ణ సీతా ప్రతిమే ఉంటుంది. ఈ విధంగా రాముడు తన జీవితంలో సీతమ్మకు తప్ప మరొకరికి స్థానం ఇవ్వలేదు. సీతారాముడు ఒకరి మనోభావాలను మరొకరు తెలుసుకొని మెలిగేవారట. సీత లేకపోతే స్వర్గం కూడా తనకు ఇష్టం కాదంటాడు రాముడు. సీత పక్కన ఉండగా చిత్రకూటం మీద నివసించడం తనకు అయోధ్యా వాసం కంటే ఎక్కువ ఆనందాన్ని కలిగిస్తుందని చెబుతాడు. సీతాపహరణానికి కుమిలి, కుమిలి ఏడుస్తాడు. ఆమె వియోగంతో శుష్కిస్తాడు. సుగ్రీవుడు చూపించిన ఆభరణాలను చూసి దుఃఖిస్తాడు. సీత క్షేమం తెలుసుకొని వచ్చిన ఆంజనేయుడిని అభినందిస్తాడు.



# మన సంస్కృతినీ, ధర్మాన్ని రక్షించుకోవడమే రక్షాబంధనం

**ఉజ్వల:** వదినా..! పద పద...త్వరగా షాపింగ్ కీ వెళ్దాం.. భలే డిస్కౌంట్ లు ఉన్నాయి మార్కెట్ లో..!

**రమ్య:** ఏంటి వదినా! అంత హడావుడి. ఇప్పుడు పెళ్లిళ్లు, పేరంటాలు ఏమున్నాయి షాపింగ్‌లకి వెళ్ళడానికి?

**ఉజ్వల:** అదేంటి! శ్రావణ మాసం నుంచి ఇక అన్నీ పండుగలే కదా. వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి ఇలా వరుసగా వస్తూనే ఉంటాయి. వరలక్ష్మి కంటే నేనూ కొంటాను కానీ, రాఖీ కడితే అన్నయ్య నాకూ చీర పెట్టాలి కదా. మంచి పట్టుచీర కొంటాను ఈసారి.

**రమ్య:** రాఖీ అంటే కేవలం సోదర, సోదరీమణులు మధ్య తాడుతో కట్టే బంధం మాత్రమే కాదని తెలుసా? ఏదో ఒక బహుమానం ఇవ్వడమే రాఖీ ఉద్దేశం కాదు.



**ఉజ్వల:** ఏమో.. అవ్వన్నీ నాకు తెలియవు. ఏ సినిమా, సీరియల్, యాడ్ చూసినా అవే కదా కనబడేవి. అయినా అందులో ఏమంత ప్రత్యేకత ఉంది?

**రమ్య:** వేదకాలంలోనే బలి చక్రవర్తితో యుద్ధానికి వెళ్తున్న భర్త క్షేమంగా తిరిగి రావాలని కోరుతూ ఇంద్రుడి భార్య శచీదేవి భర్తకు రక్ష కడుతుంది. అలాగే పురుషోత్తముడు మహావీరుడు అని తెలిసి, శత్రురాజు అయిన అలెగ్జాండర్ భార్య తన భర్త ప్రాణాలు కాపాడమని పురుషోత్తముడికి రక్ష కట్టింది.

**ఉజ్వల:** రక్షాబంధన్ వెనుక ఇంత చరిత్ర ఉందని తెలియదు. ఎంతసేపూ సోదరులు తమ సోదరికి ఏదో ఒక బహుమానం ఇవ్వాలి అనే అనుకుంటున్నాం.

**రమ్య:** మనం అందరమూ భరత మాత బిడ్డలం.. బంధువులం... ఒకరి క్షేమం కోరి మరొకరం రక్ష కట్టుకోవాలి. అందరం కలిసి ఈ దేశానికి రక్షణగా నిలబడాలి అని సంకల్పం తీసుకోవాలి. రక్షాబంధనం అంటే మన సంస్కృతినీ, ధర్మాన్ని రక్షించుకోవడమే.

**ఉజ్వల:** ఈ విధంగా ప్రతి పండుగ వెనుక ఎన్నో అర్థాలు, పరమార్థాలు ఉన్నాయి. మన పూర్వీకులు ఎంతో ఆలోచించే ఇవన్నీ పెట్టారు. శ్రావణ మాసంలో వర్షాలు పడి, పచ్చటి పొలాలు, నీటితో నిండిన వాగులు, వంకలతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ సమాజంలో ప్రతీ ఒక్కరు కూడా అలాగే ఉండాలి అనేది ఈ రక్షాబంధన్ ఉద్దేశ్యం కావచ్చు.

**రమ్య:** ఔను వదినా.. మనస్ఫూర్తిగా ఎదుటి వ్యక్తి క్షేమంగా ఉండాలి అని కోరుకోవడమే. బహుమతుల పేరుతో ఇబ్బంది పెట్టకుండా, సినీ మాయాజాలంలో పడకుండా పండుగ జరుపుకుందాం!

**– లింగం ఉజ్వల**

## పదకేళి 22

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | | | 4 | |
| | | | | | 5 | | |
| 6 | | 7 | | 8 | | | 9 |
| | | 10 | | | | 11 | |
| | 12 | | | 13 | | | |
| 14 | | | 15 | | | | 16 |
| | | 17 | | | 18 | | |
| | 19 | | | | | | |

**ఆధారాలు**

**అడ్డం**

1. పండుగల మాసం (5)
4. రక్షాబంధనం (2)
5. త్రోవ (2)
6. లక్ష్మి (3)
8. -- లో జోరీగ (2)
10. తప్పెట (2)
11. నీరో, నిప్పో ఉండే గుంట (2)
12. చురక (2)
13. నియంత్రణ (3)
14. జడ (2)
15. వస్తువు ధర (2)
18. ఇంట్లో --- మోత (3)
19. హనుమాన్ చాలీసా రచయిత (5)

**నిలువు**

2. గజగజలాడు (3)
3. ఆడిన -- తప్పరాదు (2)
4. పందిరిగుంజ (2)
5. నుయ్యి (2)
6. వంద వేలు (2)
7. శలభం (3)
9. అపాయం (2)
11. సమూహము (2)
12. సరస్వతి (2)
13. కెరటము (2)
14. వడి (2)
16. నీటిలో పుట్టేది (3)
17. చెర్నా--- (2)
18. ఈర్ష్య (2)

నిర్వహణ : ఫణీంద్ర పురాణపండ

## పదకేళి 21 - జవాబులు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 ప | తం | 2 జ | లి | | 3 గా | 4 హ | తి |
| శ | | డి | | 5 జా | | లం | |
| 6 ని | 7 జం | | 8 ల | లి | 9 త | | 10 పా |
| | 11 ట | ము | కు | | 12 గ | ర్వ | ము |
| 13 వం | | | 14 ము | క్కె | ర | | |
| 15 క | ల | | కి | | ము | | 16 బ |
| ర | | 17 దో | | 18 ఆ | | 19 రై | లు |
| | 20 ఆ | నె | | 21 సు | శ్రు | తు | డు |

# స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్ర వీరులు గాదె చిన్నపరెడ్డి

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం రెడ్డిపాలెం గ్రామంలో సుబ్బారెడ్డి, లింగమ్మ దంపతులకు జన్మించిన ధైర్యశాలి గాదె చిన్నపరెడ్డి. బాల్యం నుంచి గుర్రపు స్వారీ, కర్రసాములలో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. 1907లో మద్రాసు సంతకు వెళ్లినప్పుడు అక్కడ విన్న తిలక్ ఉపన్యాసం ఆయనలో దేశభక్తిని రగిల్చింది. ఆ తర్వాత ప్రభుత్వం పెంచిన పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాడు. 1909 ఫిబ్రవరి 18న తన ఎడ్ల బండిపై పెద్ద ప్రభను అలంకరించుకొని అనుచరులతో కోటప్పకొండకు ఊరేగింపుగా బయలుదేరాడు. అక్కడ జనసందోహాన్ని చూసి ఎడ్లు బెదిరి అదుపుతప్పాయి. ఆ సమయంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒక ఎద్దు చనిపోయింది. తను ప్రేమగా చూసుకొనే ఎద్దును చంపడంతో చిన్నపరెడ్డి, అతడి అనుచరులు పోలీసులపై తిరగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులు, ఇద్దరు యువకులు మృతిచెందారు. దీనికి బాధ్యులను చేస్తూ చిన్నపరెడ్డిని, అనుచరులను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని తరలించే సమయంలో ప్రజలు ఉవ్వెత్తున వందేమాతరం అంటూ నినదించారు. నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అరెస్టయిన వారిలో 21 మందికి ద్వీపాంతరవాస శిక్ష, చిన్నపరెడ్డికి ఉరిశిక్ష విధిస్తూ 1910 ఆగస్టు 13న మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి మన్రో తీర్పు ఇచ్చాడు. చిరునవ్వుతో ఉరితాడును ముద్దాడుతూ దేశ విముక్తి కోసం చిన్నపరెడ్డి ప్రాణత్యాగం చేశాడు.



ఇప్పటికీ ఆయన త్యాగాన్ని దేశభక్తిని గుర్తుచేసుకుంటూ పాటలు, బుర్రకథల రూపంలో గుంటూరు జిల్లాలో జనం చెప్పుకుంటుంటారు.

## ఈ నెల శ్లోకము



**విద్వత్త్వం చ నృపత్వం చ నైవ తుల్యం కదాచన।**
**స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే ॥**

**భావము:** పాండిత్యం, రాజరికం రెండూ ఎప్పటికీ సమానం కావు. రాజు తన రాజ్యంలో మాత్రమే గౌరవించబడతాడు. అయితే పండితుడు అన్నిచోట్లా గౌరవాన్ని అందుకుంటాడు. ఏ రకమైన అధికార దాంభికాలు లేకపోయినప్పటికీ విద్యాధికుడు, విద్వాంసుడైన వ్యక్తిని సమాజం ఎప్పుడూ గౌరవిస్తుంది.

# 13,750 మందితో థింసా నృత్యం - ప్రపంచ రికార్డు



**ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా 13,750 మంది గిరిజన చిన్నారులు కలిసి థింసా నృత్యం చేశారు. అంతమంది ఒకేసారి కలిసి ఈ నృత్యం చేయడం ఒక రికార్డు. ఇది గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పుస్తకంలో నమోదయింది.**

# ప్రపంచ శాంతి, శ్రేయస్సు, సమరసతల కోసం సంపూర్ణ భగవద్గీతా పారాయణం





ప్రముఖ ఆధ్యాత్మిక గురువు గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులు, మార్గదర్శనంలో అమెరికా దేశం టెక్సాస్ రాష్ట్రంలోని అలెన్ నగరంలో సంపూర్ణ భగవద్గీతా పారాయణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వేలాదిమంది భగవద్గీతా విద్యార్థులు పాల్గొని భగవద్గీతలోని మొత్తం 18 అధ్యాయాలనూ సామూహికంగా పారాయణ చేశారు. ప్రపంచ శాంతి, దేశాల మధ్య సమరసత, ప్రతీ కుటుంబానికీ శ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణ, మానవత్వం, సకల జీవరాశుల సంక్షేమమే లక్ష్యంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారిని ఉద్దేశించి గణపతి సచ్చిదానంద స్వామి ప్రసంగించారు. "భగవద్గీత బోధించే విలువలు ఏ ఒక్క దేశానికో, విశ్వాసానికో పరిమితం కావు. అవి సమస్త మానవాళికీ చెందినవి. ప్రతీ కుటుంబంలోనూ శాంతి నెలకొనాలి, ప్రతీ హృదయంలోనూ జ్ఞానజ్యోతి వెలగాలి, ప్రతీ దేశమూ సామరస్య ధోరణిలో మెలగాలి" అని స్వామి సందేశమిచ్చారు. సంపూర్ణ భగవద్గీతా పారాయణ వల్ల కలిగే ఆధ్యాత్మిక ఫలితాన్ని ప్రపంచ దేశాల శాంతి శ్రేయస్సుల కోసం అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అన్ని దేశాల నిరంతర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**HINDU NAGARA**

Telugu Monthly, Volume : 34,Issue :08

Postal Registration No : VJ/152/2023-25, RIN No. 52882/93

Date of Publishing : 28-07-2026, Date of Posting : 06-08-2026, Pages : 16



సెప్టెంబర్ 19న జరగనున్న స్వచ్ఛ సాగర్ సురక్షిత్ సాగర్ ప్రాజెక్ట్ బ్రోచర్‌ను క్షేత్ర ప్రచారకులు శ్రీ భరత్ కుమార్ చేతుల మీదగా నూతక్కిలో ఇటీవల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి, పర్యావరణ సంరక్షణ గతివిధి, సీమ సురక్ష మంచ్, విద్యా భారతి, సేవా భారతి, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫొటో వార్తలు



సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలవికాస్ మాతాజీల ఆచార్యుల రెండు రోజుల శిక్షణ తరగతులు కాణిపాకం, ద్వారకా తిరుమలలో జరిగాయి. ప్రాంత బాలవికాస్ ప్రముఖ శ్రీమతి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జూలై నెలలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో 350 మంది వరకూ పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా ఉపాధ్యాయ కన్వీనర్లతో విజయవాడలో ఒకరోజు సమావేశం జరిగింది. జూలై 18, 19 తేదీల్లో రెవిన్యూ జిల్లాల కన్వీనర్లు, కో కన్వీనర్లు, మహిళా జిల్లా కన్వీనర్లు, కోకన్వీనర్ల రెండు రోజులు అభ్యాస వర్గ నూతక్కిలోని విజ్ఞాన విహార పాఠశాలలో జరిగింది. ఈ వర్గలో మాన్యులు శ్రీ శ్యామ్ కుమార్, అఖిల భారత ధర్మ జాగరణ సహప్రముఖ్, మాన్యులు శ్రీ భరత్ కుమార్ క్షేత్ర ప్రచారక్ తదితరులు మార్గనిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో పలువురు లబ్ద ప్రతిష్టులు పాల్గొన్నారు.






సేవాభారతి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జూలై 19న సేవా సంస్థల ప్రాంత వర్గ మాతృచాయ నూతక్కిలో నిర్వహించారు. ఈ వర్గలో ప్రాంత కార్యవాహ శ్రీ వేణుగోపాల నాయుడు, శ్రీ ఎక్కా చంద్ర శేఖర్, క్షేత్ర సేవా ప్రముఖ్, ప్రాంత సేవా ప్రముఖ్ శ్రీ మనోహర్, శ్రీ వెంకటేష్ మూర్తి ఆర్ ఎస్ బి, శ్రీ విజేత RSB, ప్రాంత అధ్యక్షులు శ్రీ డాక్టర్ కెఎస్ ఎన్ చారి, ప్రాంత కార్యదర్శి శ్రీ తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

Published by : Tulasi Surya Prakash on behalf of Sahiti Sudha Foundation from Madhavasadan, Kaleswara Rao Road, Governorpet, Vijayawada - 520002 and Printer Chiruvolu Vasu Deva Rao and Printed at : B.S.R. Enterprises, D.No: 32-26-110/6, Narra Gopala Krishnaiah Street, Maruthi Nagar, VIJAYAWADA - 520004, Editor : Chiruvolu Vasu Deva Rao, Cell : 9490923439